సాక్షి అనకాపల్లి

శుక్రవారం । 1 । మార్చి । 2024



అంతా మా ఇష్టం..!

జిల్లాలో గుర్తింపు ఉన్న ప్రైవేటు స్కూళ్లు తమ వివరాలను సీబీఎస్‌ఈ వెబ్‌సైట్‌లో పొందుపరచడం లేదు. 8లో



మహిళా దినోత్సవం

విశాఖ: ఏయూలో మూడు రోజులపాటు అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహిస్తున్నట్టు వీసీ ప్రసాదరెడ్డి తెలిపారు.

నృసింహ యజ్ఞం టికెట్ల విక్రయాలు ప్రారంభం



సింహగిరిపై ఈ నెల 26 నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు సుదర్శన నారసింహ మహాయజ్ఞం వైభవంగా నిర్వహించనున్నట్టు సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు.

న్యూస్‌రీల్

రూ.11లకే కేజీ రాగి పిండి

- ఈ నెల నుంచి పంపిణీ

తుమ్మపాల: మార్చి నెల నుంచి ప్రజా పంపిణీ వ్యవస్థలో ఎండీయూ వాహనాల ద్వారా బియ్యం, పంచదార, గోధుమపిండితోపాటు రాగి పిండిని కూడా ఇంటింటికీ అందించనున్నట్లు జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి తెలిపారు. జిల్లాలో 5.5 లక్షల రైస్ కార్డుదారులు వినియోగించుకునేందుకు 330 టన్నుల రాగి పిండిని కమిషనర్ కార్యాలయం నుంచి కేటాయించినట్లు తెలిపారు. రాగి పిండి కేజీ ధర రూ.11లు అన్నారు. కేజీ రాగిపిండిలో 10.8 గ్రాముల ప్రొటీన్లు, 11 గ్రాముల ఫైబర్‌తో పాటు బి, సి, ఇ విటమిన్లు, కాల్షియం, మెగ్నీషియం, ఐరన్ మినరల్స్ సమృద్ధిగా ఉంటాయన్నారు. బహిరంగ మార్కెట్‌లో కేజీ ధర రూ.40లు ఉందన్నారు. రాగి పిండి కావాల్సిన కార్డుదారులు వారికి గల బియ్యం కేటాయింపు నుంచి ఒక కేజీ బియ్యానికి బదులు ఒక కేజీ రాగి పిండి ధర చెల్లించి పొందవచ్చని పేర్కొన్నారు.

నేడు వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్‌గా చంద్రమౌళి ప్రమాణ స్వీకారం



విశాఖ సిటీ: వీఎంఆర్‌డీఏ నూతన చైర్‌పర్సన్‌గా సనపల చంద్రమౌళి శుక్రవారం వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. యువజన కాంగ్రెస్‌లో రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన చంద్రమౌళి ఆ తరువాత వైఎస్సార్ సీపీ ఆవిర్భావంతో పార్టీలో చేరారు. వార్డు అధ్యక్షుడి స్థాయి నుంచి అంచెలంచెలుగా ఎదిగారు. పార్టీకి అంకితభావంతో ఆయన చేసిన సేవలు గుర్తించిన పార్టీ అధినాయకత్వం గత ఎన్నికల్లో విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్తగా బాధ్యతలు అప్పగించింది. ప్రస్తుతం ఆయన వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శిగా ఉన్నారు.

ఈవీఎం, స్ట్రాంగ్ రూమ్‌ల తనిఖీ



స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

తుమ్మపాల: జిల్లా ఎస్పీ కార్యాలయం సమీపంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు భద్రపరచిన స్ట్రాంగ్ రూమ్ (గొడౌన్)ను గురువారం కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, ఎస్పీ కె.వి.మురళీకృష్ణ తనిఖీ చేశారు. నెలవారీ తనిఖీలో భాగంగా అక్కడ గల సీల్‌ను, సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించారు. అడిషనల్ ఎస్పీ బి.విజయభాస్కర్, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు డి.రామ్మూర్తి, డీటీ ఎ.రవిబాబు పాల్గొన్నారు.

టెట్‌కు 90.69 శాతం హాజరు

విశాఖ విద్య: టీచర్ ఎలిజిబిలిటీ పరీక్ష(టెట్-2024) మూడో రోజు గురువారం జిల్లాలో ప్రశాంతంగా జరిగింది. జిల్లాలో ఆరు కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. ఉదయం, సాయంత్రం రెండు సెషన్లుగా జరిగిన పరీక్షకు 4,224 మంది అభ్యర్థులు నమోదు చేసుకోగా 3,831 మంది హాజరయ్యారు. 90.69 శాతం హాజరు నమోదైంది.

రోజూ టాటానగర్-ఎర్నాకుళం బై వీక్లీ ఎక్స్‌ప్రెస్

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల డిమాండ్ దృష్ట్యా టాటానగర్- ఎర్నాకుళం బై వీక్లీ ఎక్స్‌ప్రెస్ ఇకపై ప్రతిరోజూ నడుస్తుందని వాల్తేర్ డివిజన్, సీనియర్ డీసీఎం ఎ.కె.త్రిపాఠి తెలిపారు. టాటానగర్‌లో ఈ నెల 7వ తేదీ నుంచి బయల్దేరే టాటానగర్-ఎర్నాకుళం (18189) ఎక్స్‌ప్రెస్ ప్రతి రోజూ నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 10 నుంచి ఎర్నాకుళం-టాటానగర్(18190) ఎక్స్‌ప్రెస్ ప్రతి రోజూ బయల్దేరుతుంది. ప్రయాణికుల ఈ సదుపాయాన్ని వినియోగించుకుని సుఖవంతమైన ప్రయాణం సాగించాలని రైల్వే అధికారుల కోరారు.

కేజీహెచ్‌లో స్ట్రోక్ యూనిట్ ప్రారంభం



మహారాణిపేట: కేజీహెచ్‌లో న్యూరాలజీ విభాగంలో గురువారం స్ట్రోక్ యూనిట్ ప్రారంభమైంది. ఆరు పడకలతో ఈ యూనిట్‌ను సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్, ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు ప్రారంభించారు. న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎస్.గోపి, సీనియర్ న్యూరాలజిస్ట్,విశ్రాంత్రి విభాగాధిపతి డాక్టర్ కె.వేంకటేశ్వర్లు, ప్రముఖ న్యూరాలజిస్టు డాక్టర్ వై.ప్రభాకరరావు తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో సీనియర్ ప్రాక్టిసింగ్ న్యూరాలజిస్టు డాక్టర్ భాగ్యరేఖ, డాక్టర్లు ప్రదీప్, రోహిత్, సుష్మ, మనోజ్, సతీష్, ఆర్‌ఎంవో డాక్టర్ లక్ష్మీ తులసీ, ఏడీ శ్రీనివాస్ కుమార్ పాల్గొన్నారు.

అయ్యో.. అయ్యన్నా!



టీడీపీ ఫ్లెక్సీలో మార్క్ చేసిన వారికే బుధవారం అయ్యన్న కండువాలు కప్పారు..



అయ్యన్న కుమారుడు రాజేష్ పక్కన నాగాపురం టీడీపీ నాయకుడు చంటిబాబు



ఉప్పలూరి రంగా నెల రోజుల క్రితం వైఎస్సార్‌సీపీకి వ్యతిరేకంగా టీడీపీ తరఫున పోరాటం చేస్తున్న దృశ్యం

హతవిధీ..

- పాత నాయకులకే పార్టీ కండువాలు
- కొత్తగా టీడీపీలో చేరినట్టు సరికొత్త నాటకాలు

గొలుగొండ: హతవిధీ.. పార్టీ ఇయర్స్ ఇండస్ట్రీకి ఎంత దుర్గతి పట్టింది. పార్టీ గ్రాఫ్ రోజురోజుకూ పడిపోతుండగా అసలే టీడీపీ పరిస్థితి దీనంగా ఉంది. దానికి తోడు జనసేనతో పొత్తు బెడిసికొట్టి ఉన్న నాయకులు, కార్యకర్తలు కూడా గోడ దూకేస్తున్న దుస్థితి. అందుకే మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు 'కొత్త' నాటకానికి తెర తీశారు. కొత్త సీసాలో పాత సారా అన్నట్టు.. (పాత సీసాలో కొత్త సారా అనాలేమో) ఇప్పటికే పార్టీలో ఉన్న వారికి కండువాలు కప్పి కొత్తగా చేరినట్టు బిల్డప్ ఇస్తున్నారు. బుధవారం నాటి నాటకంలో పాత్రధారులు పాత కాపులే అన్న సంగతి తెలియడంతో అందరూ విస్తుపోతున్నారు. సిహెచ్.నాగాపురం గ్రామంలో అయ్యన్నపాత్రుడి సమక్షంలో వైఎస్సార్‌సీపీ నుంచి 10 మంది టీడీపీలో చేరినట్టు ప్రచారం చేశారు. తీరా చూస్తే టీడీపీ కండువాలు కప్పుకున్న వారంతా గతంలో తమ పార్టీకి చెందిన వారు కావడంతో స్థానిక తెలుగుదేశం నేతలు తలెత్తుకోలేని పరిస్థితి నెలకొంది.



నాగాపురం గ్రామానికి చెందిన కలం రాముకి టీడీపీ సభ్యత్వం ఉన్న దృశ్యం

నర్సీపట్నం నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ ప్రభంజనాన్ని తట్టుకోలేక వేస్తున్న ఎత్తులతో నవ్వులపాలయ్యామని పార్టీ కార్యకర్తలే చెవులు కొరుక్కుంటున్నారు. సిహెచ్.నాగాపురం గ్రామంలో తెలుగుదేశం పార్టీ నాయకులే మళ్లీ మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు సమక్షంలో పార్టీలో చేరడం చాలా సిగ్గుచేటుగా ఉందని నాగాపురం సర్పంచ్ యలమంచిలి రఘురాం ఎద్దేవా చేశారు. ఆయన గురువారం విలేకర్లతో మాట్లాడుతూ గ్రామానికి చెందిన ఉప్పలూరి రంగా, కులం రాము, కంకిపూడి మంగరాజు, చంటిబాబు టీడీపీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారని, వీరితో పాటు మరో నలుగురు 2019లో అయ్యన్నపాత్రుడు గెలుపు కోసం పనిచేసిన వ్యక్తులేనని తెలిపారు. వీరికే మళ్లీ టీడీపీ కండువాలు కప్పడం చాలా విడ్డూరంగా ఉందన్నారు. ఉప సర్పంచ్ సుబ్రమణ్యం తదితర్లు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

తుమ్మపాల: జిల్లావ్యాప్తంగా శుక్రవారం నుంచి ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. 38 కేంద్రాల్లో జరిగే ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 28,621మంది విద్యార్థులు హాజరు కానున్నారు. పరీక్ష కేంద్రాల్లో ఫర్నిచర్, తాగునీరు, ఫ్యాన్లు, వైద్యసేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. ఇంటర్ పరీక్షలను సజావుగా జరిపించాలని వివిధ శాఖల అధికారులతో గురువారం నిర్వహించిన వెబ్‌ఎక్స్ సమావేశంలో కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి ఆదేశించారు. ప్రతి పరీక్ష కేంద్రంలో పటిష్టమైన పోలీసు బందోబస్తు ఉండాలన్నారు. నిరంతర విద్యుత్, తాగునీరు, వైద్య సదుపాయం ఏర్పాటు చేయాలన్నారు. ప్రశ్నపత్రాలను పోలీసు బందోబస్తుతో తీసుకు వెళ్లి ప్రతి రోజు ఉదయం 9 గంటలకు తెరవాలన్నారు. ప్రతి కేంద్రంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పరిశీలించాలన్నారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రానికి వెళ్లేందుకు వీలుగా ప్రత్యేక ఆర్టీసీ బస్సులను నడపాలని ప్రజారవాణా శాఖ డీఎంను ఆదేశించారు. ప్రాంతీయ ఇంటర్మీడియట్ అధికారి సుజాత, డీఆర్వో దయానిధి, డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ హేమంత్, డీపీవో శిరీషారాణి, తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

పటిష్ట నిఘా

పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉన్నందున, పరిసర ప్రాంతాల్లో ప్రజలు గుమిగూడడం నిషేధమని ఎస్పీ కె.వి.మురళీకృష్ణ ప్రకటనలో పేర్కొన్నారు. సున్నితమైన పరీక్ష కేంద్రాల వద్ద ప్రత్యేక నిఘా కొనసాగుతుందన్నారు. ఆయా ప్రాంతాల్లో జిరాక్స్, ఇంటర్నెట్ షాపులు, వైఫై మూసివేస్తున్నట్లు పేర్కొన్నారు.

కాపులంటే అంతులేని అభిమానం



భూమి పూజ చేస్తున్న వైవీ సుబ్బారెడ్డి, అమర్‌నాథ్, ముత్తంశెట్టి



కాపు సామాజిక భవన శిలాఫలకం ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర కో-ఆర్డినేటర్, ఎంపీ వైవీ సుబ్బారెడ్డి. చిత్రంలో మంత్రి అమర్‌నాథ్, ఎంపీ ఎంవీవీ, మేయర్ హరివెంకటకుమారి, పార్టీ విశాఖ పార్లమెంట్ సమన్వయకర్త బొత్స ఝాన్సీ, ఎమ్మెల్యే ముత్తంశెట్టి, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు

- అందుకే హైవే పక్కన అత్యంత విలువైన స్థలాన్ని సీఎం జగన్ కేటాయించారు
- కాపు, యాదవ సంఘ భవనాల నిర్మాణానికి రూ.50 లక్షలు చొప్పున కేటాయిస్తా..
- వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కో-ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి వెల్లడి
- ఎండాడలో కాపు సామాజిక భవన నిర్మాణానికి ఘనంగా భూమి పూజ

మధురవాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కాపుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారని వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కో-ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి అన్నారు. ఎండాడలో దిశ పోలీస్‌స్టేషన్ పక్కన కాపు సామాజిక భవనం నిర్మాణానికి గురువారం భూమి పూజ జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. కాపుల చిరకాల కోరిక ఈ రోజు నెరవేరిందని, కాపుల పట్ల సీఎం జగన్‌కు ఉన్న అభిమానం వల్లే హైవేని అనుకుని అత్యంత విలువైన అర ఎకర స్థలం కేటాయించారన్నారు. నిర్మాణ పనులు కూడా వెంటనే ప్రారంభించి.. త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిలో కాపుల పాత్ర ఎంతో కీలకమైనదన్నారు. పశ్చిమ నియోజకవర్గం పద్మనాభనగర్‌లో కూడా కాపు భవనానికి సీఎం జగన్ రూ. 2కోట్లు నిధులు మంజూరు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. విశాఖలో మెజార్టీ కాపు, యాదవ సామాజిక వర్గాలకు చెందిన ప్రజలను ఉన్నారని, వారిని గుర్తించి కాపు, యాదవ భవనాలకు 50 సెంట్ల చొప్పున స్థలం కేటాయించినట్లు చెప్పారు. ఈ రెండు భవనాల నిర్మాణానికి తన ఎంపీ ల్యాడ్స్ నుంచి రూ.50 లక్షలు చొప్పున నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. కాపు నేస్తంతో పాటు పలు సంక్షేమ పథకాల ద్వారా ఆర్థికంగా వెనుకబడిన వారికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు.

టీడీపీ, జనసేనది లూటింగ్ టీం

వైఎస్సార్ సీపీపై చంద్రబాబు, పవన్ కల్యాణ్ చేసిన విమర్శలను మీడియా ప్రస్తావించగా.. ప్రస్తుతం రాష్ట్రంలో క్లాస్ వార్ జరుగుతోందని వై.వి.సుబ్బారెడ్డి అన్నారు. దోపిడీదారులు ఓ పక్క.. సామాన్యులకు మేలు చేసిన తాము ఓ పక్క ఉన్నామన్నారు. సినిమా డైలాగులు చెప్పడం వేరు.. వాస్తవాలు వేరన్నారు. వారిది లూటింగ్ అని.. లూటీ చేసినందుకే చంద్రబాబు జైలుకు వెళ్లారని ఎద్దేవా చేశారు. రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ 30 ఏళ్ల కిందట కాపు సామాజికవర్గానికి కేటాయించిన 10 ఎకరాల స్థలాన్ని నిలబెట్టుకోలేకపోయామన్నారు. ఇప్పుడు అలా కాకుండా తక్షణమే నిర్మాణం పూర్తి చేసుకుందామన్నారు. అత్యంత విలువైన స్థలాన్ని సీఎం జగన్ కేటాయించారని ఆనందం వ్యక్తం చేశారు. కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాలకు మేలు చేసిన వారికి అండగా ఉండాలని పిలుపునిచ్చారు. 2019 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ తరఫున 31 మంది కాపులు పోటీ చేసేందుకు సీఎం జగన్ అవకాశం కల్పించారని, ఆ 31 మందిలో 29 మంది విజయం సాధించారన్నారు. ఐదుగురు కాపులకు ముఖ్యమంత్రి కీలక మంత్రి పదవులు ఇచ్చారన్నారు. కాపుల ఆరాధ్య దైవం రంగాను చంపిన వారికి, ముద్రగడ పద్మనాభం లాంటి వారిని అవమానించిన వారికి మద్దతు చెబుతారో.. కాపులకు మేలు చేసిన వారికి అండగా ఉంటారో మీరే నిర్ణయించుకోవాలని అమర్‌నాథ్ అన్నారు. భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ నిధులు వచ్చేలోపు తన నిధులతో నిర్మాణ పనులు ప్రారంభిస్తామన్నారు. వైఎస్సార్ సీపీ విశాఖ పార్లమెంట్ ఇన్‌చార్జి బొత్స ఝాన్సీ మాట్లాడుతూ వెనుకబడిన కులాలు దేశానికి వెన్నెముక అని గుర్తించింది ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో కులగణన చేపట్టారన్నారు. తాను అందరికీ నిత్యం అందుబాటులో ఉంటానని, పార్టీలకు అతీతంగా మద్దతు ఇవ్వాలని కోరారు. ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, మేయర్ గొలగాని హరివెంకటకుమారి, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొండా రాజీవ్, జెడ్పీ వైస్ చైర్మన్ ఎస్.గిరిబాబు, పలువురు ప్రజా ప్రతినిధులు, కాపు నాయకులు ముత్తంశెట్టి నందేశ్‌బాబు, పీలా ఉమారాణి, బీఎస్ మూర్తి, తోట రాజీవ్, వంకాయల మారుతీ ప్రసాద్, తోట నగేష్ తదితరులు పాల్గొన్నారు.

కల నెరవేరింది..

- రెండు రైల్వే అండర్ పాస్ బ్రిడ్జిల నిర్మాణానికి రూ.11 కోట్లు మంజూరు
- ఎంపీ డాక్టర్ సత్యవతి వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ సత్యవతి

అనకాపల్లి: ప్రజలకు రైల్వే గేట్ కష్టాలు తీర్చాలన్న తన కల నెరవేరుతుండడం ఎంతో సంతోషం కలిగిస్తోందని ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతి అన్నారు. తన కార్యాలయంలో గురువారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. పరవాడ మండలం లంకెలపాలెం, అనకాపల్లి మండలం సత్యనారాయణపురం రైల్వే అండర్ పాస్ బ్రిడ్జిల నిర్మాణానికి రూ.11 కోట్లు మంజూరైనట్టు చెప్పారు. సత్యనారాయణపురం బ్రిడ్జి గతంలో ఒక అడుగు కూడా ముందుకు పడలేని పరిస్థితులు మనం చూశామన్నారు. ఇది తన డ్రీమ్ ప్రాజెక్ట్ అని రైల్వే మినిస్టర్, బోర్డ్ చైర్మన్ ధోనితో మాట్లాడి రైల్వే అండర్‌పాస్, రైల్వే బ్రిడ్జి సాధించుకోవడం ఆనందంగా ఉందన్నారు. రైల్వే అండర్ పాస్ అవతల గ్రామాల్లో నివసిస్తున్న వారు ఎన్ని కష్టాలు పడుతున్నారో తనకు తెలుసన్నారు. గతంలో చాలా ప్రభుత్వాలు మారినప్పటికీ ఈ సమస్యపై దృష్టి సారించకపోవడం చాలా దురదృష్టకరమన్నారు. రైల్వే అండర్ పాస్ ఎత్తు పెంచడానికి కూడా రైల్వే అనుమతులు లేకపోవడం వలన చేసేదేమీ లేదని రైల్వే అధికారులు కరాఖండిగా చెప్పినప్పటికీ అధికారులను తీసుకెళ్లి సమస్యను వివరించి పరిష్కార దిశగా అడుగులు వేస్తున్నట్లు చెప్పారు. అదేవిధంగా లంకెలపాలెం రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మించినప్పటికీ కిందన రోడ్డు, రైల్వే గేట్ మూసి వేయడం వలన ప్రజలు అనకాపల్లి, విశాఖ పట్నం వెళ్లడానికి చుట్టూ తిరిగి రావలసి వస్తోందన్నారు. కొన్ని సందర్భాల్లో అక్కడ యువకులు, వ్యాపారులు దగ్గరగా ఉంటుందని చెప్పి ఆ రైల్వే ట్రాక్ దాటుతున్నారని, ఇది పలు ప్రమాదాలకు దారితీస్తున్నట్లు గుర్తించామన్నారు. కేంద్రం మంజూరుతో సంబంధం లేకుండా పరవాడ మండలం లంకెలపాలెం, అనకాపల్లి మండలం సత్యనారాయణపురం రైల్వే అండర్ పాస్ బ్రిడ్జిల నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.11 కోట్లు మంజూరు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, సత్యనారాయణపురం సర్పంచ్ పలకా భాగ్యలక్ష్మి, ఎంపీటీసీలు జోగా నాగమణి, కె.అలివేణి పాల్గొన్నారు.

చక్కని ప్రణాళికతో భావి పారిశ్రామికవేత్తలుగా..

- విద్యార్థులు ఆ దిశగా ఆలోచించాలి
- డీఈవో వెంకటలక్ష్మమ్మ



విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ

అనకాపల్లి: విద్యార్థులు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు ప్రణాళికలు రూపొందించుకోవాలని డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ అన్నారు. స్థానిక ఉడ్‌పేట జీవీఎంసీ ప్రైమరీ పాఠశాలలో గురువారం జరిగిన జిల్లా స్థాయి ఎంట్రప్రెన్యూర్ మైండ్‌సెట్ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. విద్యనభ్యసించడంతోపాటు ఉపాధి కల్పన అవకాశాలను అన్వేషించాలని సూచించారు. 13 పాఠశాలల విద్యార్థులు వారి వారి ప్రాజెక్టులను ప్రదర్శించారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు ప్రాజెక్టులను ఆమెతోపాటు డిప్యూటీ డీఈవో పి.అప్పారావు, ఏఎంవో మురళి పట్నాయక్, డీసీఈబీ సత్యనారాయణ, జిల్లా సైన్స్ అధికారి డి.కాళిదాసులు పర్యవేక్షించారు. ఉప్పరాపల్లి జెడ్పీ హైస్కూల్, వీరనారాయణం జెడ్పీ హైస్కూల్ జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాలకు ఎంపికయ్యాయి. ఈ స్కూలు విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు పంపనున్నారు. విజేతలకు డీఈవో వెంకటలక్ష్మమ్మ బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఈఎంపీడీపీ డిస్ట్రిక్ట్ మేనేజర్ నరేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి పెద్ద పీట



తాటిపర్తి శివారు కాశీపురంలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు

8లో

పల్లె గూటికి పండగొచ్చింది. మాడుగుల మండలంలోని పలు గ్రామాల్లో రూ.14 కోట్ల వ్యయంతో నిర్మించిన అభివృద్ధి పనులను డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ప్రారంభించారు. జలజీవన్ మిషన్ పనులు, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, రైతు భరోసా కేంద్రం తదితరాలను ప్రారంభించారు. తాచేరు నదిపై వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ప్రజల వెతలు తెలిసిన వాడిని, అవి తీరే వరకు విశ్రమించనని ఉప ముఖ్యమంత్రి చెప్పారు.

తులసీరావు సేవలు చిరస్మరణీయం

8లో

వాహనాలు రయ్ రయ్..

- యలమంచిలి ఫ్లై ఓవర్‌పై రాకపోకలు ప్రారంభం
- వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ



వంతెనపైకి వాహనాల రాకపోకలను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు, విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్, యలమంచిలి చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి

యలమంచిలి రూరల్: పట్టణంలో రూ.35కోట్ల వ్యయంతో నిర్మించిన ఫ్లై ఓవర్ బ్రిడ్జి (రైల్ ఓవర్ బ్రిడ్జి)ని గురువారం ప్రజలకు అంకితం చేశారు. స్థానిక శాసనసభ్యుడు కన్నబాబురాజు, విశాఖ పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ జెండా ఊపి ఈ వంతెనపై నుంచి రాకపోకలను ప్రారంభించారు. నాలుగు మండలాల నుంచి వచ్చిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు బ్రిడ్జిపై భారీ బైక్ ర్యాలీ నిర్వహించాయి. రైల్వే గేటు కష్టాల నుంచి విముక్తి లభించిందని ప్రయాణికులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలు వంతెనపై నుంచి పరుగులు తీశాయి. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి, ఎంపీపీ బోదెపు గోవింద్, మార్కెట్ కమిటీ చైర్మన్ బొద్దపు యర్రయ్యదొర, మున్సిపల్ వైస్ చైర్మన్లు అర్రెపు గుప్త, బెజవాడ నాగేశ్వరరావు పాల్గొన్నారు.



బ్రిడ్జి పై నుంచి ర్యాలీగా వస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

గ్రామాల అభివృద్ధికి పెద్ద పీట



తాచేరు బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న బూడి ముత్యాలనాయుడు



డి. సురవరంలో సీసీ రోడ్లు, డ్రైనేజీలను సర్పంచ్ జయమ్మ చేతుల మీదుగా ప్రారంభింపజేస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

- డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు
- రూ. 14 కోట్లతో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు

మాడుగుల రూరల్ : గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని, తాము గతంలో ఇచ్చిన హామీలు నెరవేరుస్తామని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు పేర్కొన్నారు. మండలంలో నాలుగు గ్రామాల్లో సుమారు రూ. 14 కోట్లతో నిర్మించిన అభివృద్ధి పనులకు ఆయన నాయకులతో కలిసి గురువారం ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. తొలుత మాడుగుల బస్టాండ్‌లో గల దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం రూ. 9.92 లక్షలతో నిర్మించిన జల్‌జీవన్ మిషన్ పనులు ప్రారంభించారు. అలాగే తాచేరు నదిపై రూ. 3 కోట్ల 40 లక్షలతో చేపట్టిన బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 1.5 కిలోమీటర్ల పొడవున ఈ వంతెన నిర్మిస్తున్నట్లు తెలిపారు. దీనివల్ల 20 గ్రామాల ప్రజలు ఎటువంటి ఆటంకం లేకుండా రాకపోకలు సాగించగలరన్నారు. ఎన్నో సంవత్సరాల కలగా మిగిలిన ఈ రహదారి, బ్రిడ్జి నిర్మాణానికి రూ. 7.40 కోట్లు మంజూరు చేశామన్నారు. అనంతరం రైతులు డిప్యూటీ సీఎంను ఘనంగా సన్మానించారు.

తాటిపర్తి సచివాలయం పరిధిలోని కాశీపురంలో రూ. 23.94 లక్షలతో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించి మొక్కలు నాటారు. సాగరం శివారు సురవరంలో రూ. 20 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, డ్రైనేజీని ప్రారంభించారు. ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, జెడ్పీటీసీ సభ్యురాలు కిముడు రమణమ్మ, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వేమవరపు రామధర్మజ, స్థానిక ఏఎంసీ చైర్మన్ శానాపతి కొండలరావు, పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, మాడుగుల సర్పంచ్ యడ్ల కళావతి, ఎంపీటీసీ సభ్యురాలు పొలిమేర విజయలక్ష్మి, కుక్కర మహేశ్వరి, తాటిపర్తి సర్పంచ్ అల్లంగి వెంకట గౌరీదేవి, సాగరం సర్పంచ్ కోట్ని జయమ్మా, ఎంపీటీసీ సభ్యురాలు శ్రీనాథు సూర్యకాంతం పాల్గొన్నారు.

క్లుప్తంగా

దివ్యాంగులకు డిజిటల్ విద్య చేరువ చేయాలి



సూచనలు చేస్తున్న రాష్ట్ర సమగ్ర శిక్ష సహిత విద్యా పరిశీలకులు డాక్టర్ నరసింహం

అనకాపల్లి: ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు డిజిటల్ విద్య అందించాలని రాష్ట్ర సమగ్ర శిక్ష సహిత విద్యా పరిశీలకులు డాక్టర్ వై. నరసింహం అన్నారు. గ్రేటర్‌విశాఖ విలీన గ్రామమైన కొప్పాక ప్రైమరీ స్కూల్ ఆవరణలో ఉన్న భవిత కేంద్రాన్ని ఆయనతో పాటు జిల్లా సహిత విద్యా సమన్వయ అధికారి శకుంతల గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని రకాల సేవలు, సదుపాయాలను అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మి నాయుడు, వరప్రసాద్, భవిత కేంద్రం ప్రత్యేక ఉపాధ్యాయురాలు రమాదేవి, దివ్యాంగ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనే లక్ష్యం



మాట్లాడుతున్న బాలల హక్కుల కమిషన్ మెంబర్ సీతారాం

నర్సీపట్నం : బాలకార్మిక వ్యవస్థను 2025 నాటికి రూపుమాపాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఏపీ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ మెంబర్ గొండు సీతారాం పేర్కొన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

ప్రతి ఒక్క అధికారి జీవో నంబరు 31,39పై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఏడాదిలో అనకాపల్లి జిల్లాలో 86 బాల్య వివాహాలు జరిగాయని, వాటిని అరికట్టవలసిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. బాల్య వివాహాలను అడ్డుకోవటమే కాకుండా ఎఫ్ఐఆర్ నమోదు చేయాలన్నారు. ఆర్డీవో హెచ్.వి.జయరాం మాట్లాడుతూ పిల్లలను పనిలో పెట్టకుండా చదివించాలన్నారు. బాల్య వివాహాల నిర్మూలన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఐసీడీఎస్ పీడీ అనంతలక్ష్మి, సీడీపీవో మేరీ సువార్త, ఎంఈవో సీహెచ్ తలుపులు, నాలుగు మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐగా కిరణ్ మణీశ్వరి



చోడవరం రూరల్ : స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బి.హెచ్. కిరణ్ మణీశ్వరి నియమితులయ్యారు. గురువారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. రణస్థలం స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న కిరణ్ మణీశ్వరి బదిలీపై చోడవరానికి వచ్చారు. ఇప్పటి వరకు ఈ స్థానంలో విధులు నిర్వర్తించిన జోగమ్మను మన్యం జిల్లా కురుపాం స్టేషన్‌కు బదిలీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ అక్రమంగా సారా తయారీ, అమ్మకాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు దుర్మరణం



మృతుడు నూకరాజు

అనకాపల్లి : రోడ్డు ప్రమాదంలో బట్లపూడి గ్రామానికి చెందిన తాచుపల్లి నూకరాజు (62) అనకాపల్లి నుంచి పెందుర్తి వైపు వెళ్తున్న లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అనకాపల్లి పట్టణంలో పూడిమడక రహదారిలో తన పెద్ద కుమార్తె ఇంటికి వెళ్లి ఈనెల 1వ తేదీన ప్రభుత్వ పింఛన్ కోసం తిరిగి వస్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. మృతదేహాన్ని ట్రాఫిక్ పోలీసులు ఎన్టీఆర్ వైద్యాలయానికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుడికి ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. అందరికీ పెళ్లిళ్లు అయ్యాయి. ఈ మేరకు కుమారుడు తాచుపల్లి నూక అప్పారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాటుసారా తయారీ కేంద్రాలపై దాడులు



డ్రమ్ముల్లో నిల్వ ఉంచిన బెల్లం పులుపును సిబ్బంది సాయంతో ధ్వంసం చేస్తున్న సీఐ కిరణ్ మణీశ్వరి

కె. కోటపాడు : కె. కోటపాడు మండలంలో పిద్రంగి, కొత్తభూమి గ్రామాల్లో గురువారం ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. అనకాపల్లి జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ దాడుల్లో రెండు గ్రామాల్లో నాటుసారా తయారీకి సిద్ధంగా ఉంచిన 4,200 లీటర్ల బెల్లం పులుపును చోడవరం ఎక్సైజ్ సీఐ కిరణ్ మణీశ్వరి గుర్తించి సిబ్బంది సహాయంతో ధ్వంసం చేశారు. నాటుసారా తయారు చేసినా, దాంతో పట్టుబడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అక్రమ మద్యం కేసులో ఇద్దరు అరెస్ట్

రాంబిల్లి: అక్రమ మద్యం కేసులో రాంబిల్లికి చెందిన ఇద్దరు వ్యక్తులను గురువారం అరెస్ట్ చేసినట్లు సీఐ ఎస్. లక్ష్మణరావు తెలిపారు. వారి నుంచి 16 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. అక్రమ మద్యం విక్రయాలు, తరలింపుపై నిఘా పెట్టామన్నారు. విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. అక్రమ మద్యం విక్రయాలు, తరలింపుపై తమకు సమాచారం ఇవ్వాలని సీఐ సూచించారు.

అగ్ని ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి

కోటవురట్ల : చీరకు నిప్పంటుకుని తీవ్రంగా గాయపడిన ఘటనలో ఓ మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఎస్ఐ రమణయ్య తెలిపిన వివరాలివి. కొడవటిపూడి గ్రామానికి చెందిన కొంకిపూడి భవానీ (43) ఫిబ్రవరి 27వ తేదీన ఇంట్లో వంట చేస్తుండగా గ్యాస్ స్టవ్ మంటపై ప్రమాదవశాత్తు చీర కొంగు పడి మంటలు చెలరేగాయి. దాంతో పాటు గ్యాస్ లీకై పెద్ద ఎత్తున మంటలు ఎగసిపడ్డాయి. మంటల్లో చిక్కుకున్న ఆమె కేకలకు భర్త వెంకటరమణతో పాటు స్థానికులు పరుగున వచ్చి మంటలు ఆర్పి వెంటనే ఆమెను నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి విశాఖలోని కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. ఈ మేరకు మృతురాలి సోదరుడు పసుపులేటి సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

కల్యాణపులోవ తిరునాళ్లను ఘనంగా నిర్వహించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న విప్ ధర్మశ్రీ

- సన్నాహక సమావేశంలో అన్ని శాఖల అధికారులకు విప్ ధర్మశ్రీ సూచన

రావికమతం : మహాశివరాత్రి సందర్భంగా కల్యాణపులోవ తిరునాళ్లకు లక్షల్లో భక్తులు రానున్న దృష్ట్యా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి విజయవంతం చేయాలని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. ఈ నెల 8 నుంచి మూడు రోజుల పాటు కల్యానపులోవ తిరునాళ్లు నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ నిర్ణయించిన నేపథ్యంలో అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ముఖ్య నాయకులతో చోడవరం ఎమ్మెల్యే ధర్మశ్రీ రావికమతంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పైల రాజు, మండల పార్టీ అధ్యక్షుడు ముక్కా మహాలక్ష్మినాయుడు, మండల సచివాలయ కన్వీనర్ కంచిపాటి జగన్నాథరావు, డీసీఎంఎస్ డైరెక్టర్ గుమ్ముడు సత్యదేవ, వైస్ ఎంపీపీలు దంట్ల వెంకట రమణ, మత్స భవానీ ప్రసాద్, తహసీల్దార్ రామారావు, ఎంపీడీవో భానోజీరావు, రెవెన్యూ, దేవదాయ, పంచాయతీరాజ్, విద్యుత్, రవాణా, నీటిపారుదల, పోలీసు శాఖ అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. యాత్రికులకు తాగునీరు, వైద్యం అందుబాటులో ఉండాలని, స్నానాల రేవు వద్ద గజ ఈతగాళ్లను సిద్ధం చేయాలని తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు.

తులసీరావు సేవలు చిరస్మరణీయం



నగరవనం శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు, రమాకుమారి, ఆనంద్‌కుమార్



యలమంచిలి డిగ్రీ కళాశాలలో తులసీరావు బ్లాకును పరిశీలిస్తున్న నాయకులు

యలమంచిలి : రైతు బాంధవుడు స్వర్గీయ ఆడారి తులసీరావు కుటుంబం యలమంచిలి పట్టణాభివృద్ధిలో ఎంతో కృషి చేసిందని యలమంచిలి ఎమ్మెల్యే యు.వి. రమణమూర్తి (కన్నబాబు) రాజు అన్నారు. యలమంచిలి పట్టణంలో గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విశాఖ డెయిరీ నిధులతో నూతనంగా నిర్మించిన ఆడారి తులసీరావు తరగతి గదులను విశాఖ డెయిరీ చైర్మన్, విశాఖ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడారి ఆనంద్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మతో కలిసి గురువారం లాంఛనంగా ప్రారంభించారు. రూ. 45 లక్షలతో నిర్మించిన పై అంతస్తు బ్లాకులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యలమంచిలి డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అన్ని వసతులతో విశాఖ డెయిరీ నిధులు వెచ్చించి తరగతి గదులు నిర్మించినట్లు తెలిపారు. యలమంచిలి త్రిమూర్తుల స్వామి గుడి వద్ద ఉన్న సన్యాసమ్మ చెరువు ప్రాంతాన్ని ఆధునికీకరించి ఆడారి తులసీరావు నగరవనంగా నామకరణం చేయనున్నట్లు తెలిపారు. ఈ పనులకు సంబంధించి ఆడారి ఆనంద్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె. కొండలరావు, ఎంపీపీ బోదెపు గోవిందు, మున్సిపల్ వైస్ చైర్మన్ అర్రెపు గుప్త, బెజవాడ నాగేశ్వరరావు, యలమంచిలి మార్కెట్ కమిటీ చైర్మన్ బొద్దపు యర్రయ్యదొర, కొక్కిరాపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడు మళ్ల కొండబాబు, పట్టణ కౌన్సిలర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చేపల చెరువుల్లో చికెన్ వ్యర్థాలు వేస్తే కఠిన చర్యలు



చేపల చెరువు నిర్వాహకుడికి నోటీస్ అందజేస్తున్న ఇన్‌చార్జి ఎఫ్‌డీవో నాగమణి తదితరులు

దేవరాపల్లి : చేపల చెరువుల్లో మేతగా చికెన్ వ్యర్థాలు వేసినా, నిషేధిత చేపలను పెంచినా కఠిన చర్యలు తీసుకుంటామని మాడుగుల ఇన్‌చార్జి మత్స్యశాఖ అభివృద్ధి అధికారి (ఎఫ్‌డీవో) టి. నాగమణి హెచ్చరించారు. మండలంలో అక్రమంగా నిర్వహిస్తున్న చేపల చెరువులపై మత్స్యశాఖ, రెవెన్యూ, పోలీస్ అధికారులు సంయుక్తంగా గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. చేపల చెరువుల్లో చికెన్ వ్యర్థాలను మేతగా వినియోగిస్తున్నారని ఉన్నాధికారులకు కొందరు ఫిర్యాదు చేయడంతో మత్స్యశాఖ అధికారులు స్పందించారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎస్. సతీష్ పోలీసులతో ఆయా గ్రామాల రెవెన్యూ, మత్స్యశాఖ సిబ్బందితో కలిసి దేవరాపల్లి, మారేపల్లి, చేనులపాలెం, కలిగొట్ల, ములకలాపల్లి, కొత్తపెంట తదితర గ్రామాల్లోని చేపల చెరువులను పరిశీలించారు. చేపల చెరువుల్లో చేపలకు మేతగా చికెన్ వ్యర్థాల కటింగ్ వినియోగించే మిషన్లు తొలగించి, నేచరల్ ఫీడ్ మాత్రమే వేయాలని హెచ్చరిక జారీ చేశారు. అలాగే మండలంలో చేపల చెరువుల అనుమతులు కోసం తక్షణమే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, 46 మంది నిర్వాహకులకు నోటీసులు అందజేశామని ఇన్‌చార్జి ఎఫ్‌డీవో నాగమణి తెలిపారు.

ఇంటర్ పరీక్షలకు పక్కా ఏర్పాట్లు



దేవరాపల్లి పరీక్షా కేంద్రంలో సిద్ధం చేసిన బెంచీలు

దేవరాపల్లి : దేవరాపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం నుండి ప్రారంభమయ్యే ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు స్థానిక పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ పి. ఉమామహేశ్వరి, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ సన్యాసిరావు తెలిపారు. ఈ మేరకు స్థానిక కళాశాలలో గురువారం విలేకరులతో మాట్లాడారు. మార్చి 1 నుండి 18 వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు శుక్రవారం, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు శనివారం నుండి పరీక్షలు ప్రారంభమవుతాయన్నారు. మొదటి సంవత్సరం విద్యార్థులు 237 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 250 మంది, ప్రైవేటు విద్యార్థులు 25 మంది హాజరుతారన్నారు. దేవరాపల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీతో పాటు తెనుగుపూడి గురుకుల కళాశాల, బేతపూడి కేజీబీవీ, శారదాశ్రీ, పీవీసీ ఒకేషనల్ కళాశాలల నుండి విద్యార్థులు హాజరవుతారన్నారు. సీసీ కెమెరాల నిఘా మధ్య పరీక్షలు నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామన్నారు. ఉదయం 9 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని, విద్యార్థులు పరీక్ష సమయానికి 45 నిముషాల ముందు చేరుకోవాలన్నారు. పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.

ఏయూతో ఆస్కా సంస్థ ఎంవోయూ



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న రెండు సంస్థల ప్రతినిధులు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంతో ప్రముఖ ఎన్‌జీవో సంస్థ ఆప్ సబ్ కీ ఆవాజ్ (ఆస్కా) గురువారం అవగాహన ఒప్పందం చేసుకుంది. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి సమక్షంలో ఒప్పందపత్రాలపై రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ఆస్కా అధ్యక్షుడు శివ్ వడ్ల మూడి సంతకాలు చేశారు. అవగాహన ఒప్పందంలో భాగంగా యువతతో స్వచ్ఛంద రక్తదాన శిబిరాల నిర్వహణ, రక్తహీనతపై అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలు చేపడుతుంది. ఏయూ ఓఎస్డీ ఆచార్య వి.కృష్ణమోహన్, ఆస్కా సహ వ్యవస్థాపకుడు, జనరల్ సెక్రటరీ బి.కిరణ్ కుమార్, ఆచార్య ఇ.ఎన్.ధనుంజయ రావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అంతా మా ఇష్టం..!



నగరంలోని ఎన్‌ఏడీ శాంతినగర్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో సీబీఎస్‌సీ బోధన అమలు చేస్తున్నారనే క్రేజ్‌తో వేలాది రూపాయలు ఫీజు చెల్లించి తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పిస్తున్నారు. 2023-24లో ఇక్కడ ఏ ఒక్క విద్యార్థికి కూడా ఉచిత విద్యకు యాజమాన్యం అవకాశం కల్పించలేదు. తాజాగా 2024-25 విద్యా సంవత్సరానికి సీఎస్‌ఈ వెబ్‌సైట్‌లో ఈ స్కూల్ పేరు కనిపించటం లేదు. ఇలాంటి స్కూళ్లు జిల్లాలో చాలానే ఉన్నాయి. వాటిలో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం లేకుండా పోతుందని విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు.

- ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాల ఇష్టారాజ్యం
- సీఎస్‌ఈ వెబ్‌సైట్‌లో నమోదులో నిర్లక్ష్యం
- ఒకటో తరగతిలో ఉచిత సీట్లు ఇచ్చేందుకు ముందుకు రాని వైనం
- స్కూళ్ల రిజిస్ట్రేషన్‌కు నేటితో ముగుస్తున్న గడువు

విశాఖ విద్య: విద్యాహక్కు చట్టం (12(1)(సీ) అమల్లో భాగంగా 2024-25 విద్యా సంవత్సరంలో ప్రైవేటు స్కూళ్లలోనూ పేద విద్యార్థులకు ఒకటో తరగతిలో ఉచితంగా ప్రవేశం పొందేందుకు ప్రభుత్వం షెడ్యూల్ జారీ చేసింది. స్టేట్ సిలబస్‌తో పాటు, ఐబీ/ఐసీఎస్ఈ/సీబీఎస్ఈ బోధన అమలు చేసే ప్రైవేటు స్కూళ్లలో తప్పనిసరిగా ఒకటో తరగతిలో 25 శాతం మేర సీట్లు పేదలకు ఉచితంగానే ప్రవేశాలు కల్పించాలని ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతోంది.

నమోదులో నిర్లక్ష్యం

గుర్తింపు ఉన్న ప్రైవేటు స్కూళ్ల వివరాలను కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్(సీఎస్ఈ) వెబ్‌సైట్‌లో పొందుపరచాలి. కానీ ఈ విషయంలో జిల్లాలోని కొన్ని ప్రైవేటు స్కూళ్ల నిర్వాహకులు అంతా మా ఇష్టం అనే ధోరణిలో వ్యవహరిస్తున్నారు. ఫిబ్రవరి 23 నాటికే వెబ్‌సైట్‌లో రిజిస్టర్ కావాల్సి ఉండగా, ప్రైవేటు స్కూళ్లు వారికి మరో అవకాశం కల్పిస్తూ దీనిని మార్చి 1 వరకు పొడిగించారు. గురువారం నాటికి జిల్లాలో ఇంకా 22 స్కూళ్లు నమోదు కాలేదు. ఇందులో ఢిల్లీ పబ్లిక్ స్కూల్, ఓక్రిడ్జ్, ప్రెసిడెన్షియల్, సిల్వర్‌ఓక్స్, టింపనీ, పోలాక్స్, శివ శివానీ, విశాఖ వ్యాలీ వంటి ప్రైవేటు స్కూళ్లు ఉండటం గమనార్హం. ఇది ప్రభుత్వ ఆశయానికి తూట్లు పొడవటమేనని తల్లిదండ్రులు అంటున్నారు.

వివరాలు సేకరిస్తున్న మండల స్థాయి కమిటీలు

ఉచిత ప్రవేశాలకు ముందుకు రాని స్కూళ్ల వివరాలను మండలాల వారీగా గుర్తించి, వాటిని వెంటనే నమోదు చేయించేలా మండల స్థాయి కమిటీలు పర్యవేక్షణ చేస్తున్నాయి. దీనిపై సీఆర్పీలకు బాధ్యతలు అప్పగించారు. ఇదే క్రమంలో విద్యార్థులకు సంబంధించిన గత బకాయిలను స్కూళ్ల యాజమాన్యాలకు చెల్లించేలా పూర్తి స్థాయిలో వివరాలను సేకరిస్తున్నారు.

స్కూళ్లన్నీ నమోదు కావాల్సిందే..



జిల్లాలో 95 శాతానికి పైగా ప్రైవేటు పాఠశాల యాజమాన్యాలు వెబ్‌సైట్‌లో రిజిస్టర్ అయ్యాయి. నూరుశాతం నమోదు చేసేలా మండల స్థాయి కమిటీలు పర్యవేక్షణ చేస్తున్నాయి. పేద విద్యార్థులకు ఉచితంగా సీట్లు ఇచ్చేలా స్కూళ్లన్నీ తప్పనిసరిగా రిజిస్టర్ చేసేలా శ్రద్ధ తీసుకుంటున్నాం.

–ఎల్.చంద్రకళ, డీఈవో, విశాఖ జిల్లా

గుర్తింపు రద్దుకు సిఫార్సు చేస్తాం



ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు ప్రైవేటు స్కూళ్లలో 25 శాతం మేర పేద విద్యార్థులకు ఉచితంగా సీట్లు ఇవ్వాలి. ఇందుకు నిరాకరించే స్కూళ్ల గుర్తింపు రద్దుకు సిఫార్సు చేస్తాం. ప్రభుత్వ ఆశయానికి తూట్లు పొడిచేలా వ్యవహరిస్తున్న యాజమాన్యాలపై క్రిమినల్ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

– డాక్టర్ గొండు సీతారాం, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు

'చంద్రబాబు హయాంలో రాష్ట్ర ప్రగతి'



గంపవానిపాలెంలో మాట్లాడుతున్న నారా భువనేశ్వరి

బుచ్చెయ్యపేట, రోలుగుంట, రావికమతం: యువతను ఆదుకోవడానికి తన భర్త అనేక పరిశ్రమలు తీసుకొచ్చారని ప్రతిపక్ష నాయకుడు నారా చంద్రబాబునాయుడు సతీమణి భువనేశ్వరి అన్నారు. ఆమె గురువారం బుచ్చెయ్యపేట మండలం ఆర్.భీమవరం గ్రామం, రావికమతం మండలం గంపవానిపాలెం, రోలుగుంట మండలం జె.పి.అగ్రహారాల్లో మరణించిన టీడీపీ కార్యకర్తల కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని ప్రస్తుత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. రాష్ట్రంలో రాక్షస పాలన నడుస్తోందన్నారు. మాజీ ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్ రాజు, పార్టీ చోడవరం ఇన్‌చార్జి బత్తుల తాతయ్యబాబు, బుద్ధ నాగజగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. భువనేశ్వరి ప్రసంగాల్లో జనసేన పార్టీ గురించి ప్రస్తావించకపోవడం గమనార్హం

ఓపెన్ పరీక్షలకు 27 మంది ఖైదీలు

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారంలో ఈ ఏడాది ఓపెన్ పరీక్షలు రాయడానికి 27 మంది ఖైదీలు సిద్ధమవుతున్నారు. పదో తరగతి ఓపెన్ పరీక్షలు 9 మంది, ఇంటర్మీడియట్ 18 మంది ఓపెన్‌లో పరీక్షలు రాయనున్నట్లు జైల్ అధికారులు తెలిపారు. వీరికి ఈ ఏడాది మార్చి 18 నుంచి ఓపెన్ పరీక్షలు జరగనున్నాయి.

క్లుప్తంగా

తాళ్లపాలెంలో అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం నేడు



తాళ్లపాలెంలో ప్రారంభోత్సవానికి సిద్ధమైన సచివాలయ భవనం

కశింకోట: తాళ్లపాలెంలో రూ.91 లక్షలతో నిర్మించిన పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి సన్నాహాలు చేశారు. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ శుక్రవారం వీటిని ప్రారంభించనున్నట్లు వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి లగిశెట్టి గణేష్ తెలిపారు. రూ.43 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం, రూ.28 లక్షలతో నిర్మించిన సిమెంట్ కాలువలు, రూ.20 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్లు ప్రారంభిస్తారని తెలిపారు.

పల్స్‌పోలియోపై అవగాహన



తాళ్లపాలెం కూడలిలో పల్స్ పోలియో ప్రచార బ్యానర్

కశింకోట : పోలియో నిర్మూలనకు తాళ్లపాలెంలో ఈ నెల 3న నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమంపై గురువారం అవగాహన కలిగిస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ ఆరోగ్య సిబ్బంది కూడలిలో కార్యక్రమం గురించి తెలియజేసే బ్యానర్లు ఏర్పాటు చేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారి యు.రమేష్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

4న ఉచిత కంటి పరీక్షలు

అనకాపల్లి : స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారి రాజా ఆప్టికల్స్ వద్ద శంకర్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో ఈ నెల 4న ఉచిత కంటి పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని ఫౌండేషన్ ప్రతినిధి రాజా గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కంటి పరీక్షలకు ఎంపికైన రోగులకు సింహాచలం శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రుల్లో ఉచితంగా ఆపరేషన్లు చేయించి, వారానికి సరిపడే మందులు రోగికి అందజేయడం జరుగుతుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 9032223330 నంబరును సంప్రదించాలన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు గురువారం 4,937 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,700	4,550
మొదటి రకం	3,510	4,330
రెండో రకం	3,480	3,880
మూడోరకం	3,250	3,470

అనకాపల్లి సినిమాలు

ఈగల్	:	రాజా
ఆపరేషన్‌వాలంటైన్	:	సత్యనారాయణస్క్రీన్-1
భ్రమయుగం	:	సత్యనారాయణస్క్రీన్-2
సిద్దార్థరోయ్	:	షిర్డిసాయి
ఊరు పేరు భైరవకోన	:	పర్తిసాయి
నాగదీపం	:	వెంకటేశ్వర
ఇంటి నెం.13	:	శ్రీసత్య
ఛారీ 111	:	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 46 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-12 యూనిట్లు, బీ పాజిటివ్-26 యూనిట్లు, ఓ పాజిటివ్-6 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నిషన్ యు.లోకేష్ (9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 428 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 365 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

ఆయుష్ వైద్యానికి ఆదరణ



ఆసుపత్రిలో యోగాపై ఉచిత శిక్షణ ఇస్తున్న శిక్షకురాలు



ఆసుపత్రి ఆవరణలో ఆయుర్వేద మొక్కలు

- ఎన్టీఆర్ వైద్యాలయం ఆవరణలో ఆయుష్ విభాగం
- ఉచితంగా రోగులకు మందులు
- రూ.6లక్షలతో ఆస్పత్రి అభివృద్ధి

అనకాపల్లి: కరోనా వంటి విపత్తుల తర్వాత ఆయుష్ విభాగంలో ఆయుర్వేదంపై ప్రజలకు మరింత చైతన్యం పెరిగింది. స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో ఆయుష్మాన్ భారత్ వైద్యాలయాన్ని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌గా అప్‌గ్రేడ్ చేశారు. ఆస్పత్రిని రూ.6లక్షలతో సివిల్ పనులతోపాటు రోగులకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కూడా కల్పిస్తున్నాయి.

- వైద్యాలయంలో ఇద్దరు యోగా శిక్షకులను ప్రభుత్వం నియమించగా ఉదయం 10 నుంచి 11 గంటల వరకు ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో ఆస్పత్రికి వచ్చే రోగులకు యోగాసనాలపై తర్ఫీదు ఇవ్వగా నియోజకవర్గ పరిధిలో ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లో మరో పురుష శిక్షకులను నియమించారు. స్కూళ్లో విద్యార్థుల సమయానుసారం రోజుకు ఒక గంట యోగాపై శిక్షణ ఇస్తారు.
- ఆయుర్వేద వైద్యాలయానికి రోజుకు 30 నుంచి 35 మంది రోగులు వస్తున్నారు.
- కీళ్ల వ్యాధులతో బాధపడే రోగులకు ఇన్‌ఫ్రా డైట్ అనే యంత్రంతో చికిత్స చేస్తూ క్రమేపీ వ్యాధి నివారణకు వైద్యులు కృషి చేస్తున్నారు.
- మహిళలు గైనిక్ సమస్యతో బాధపడేవారికి, రక్తహీనత ఉన్న వారికి కూడా ఆయుర్వేదంలో మందులిస్తున్నారు. ఆయాసం, దగ్గు, జలుబు, జీర్ణాశయ వ్యాధులకు కూడా ప్రభుత్వం మందులు ఉచితంగా అందిస్తోంది.
- వాతావరణ మార్పుల కారణంగా చర్మ వ్యాధులకు గురైన రోగులకు కూడా వైద్యసేవలందుతున్నాయి.
- ఆయుర్వేద మందులను రాష్ట్ర ప్రభుత్వం కేరళ, ఉత్తరాఖండ్, గోవా, కర్నాటక రాష్ట్రల నుంచి తీసుకువచ్చి ఇక్కడ రోగులకు ఉచితంగా అందజేస్తోంది. ఇక్కడ 100 నుంచి 110 రకాల మందులు రోగులకు అందుబాటులో ఉన్నాయి.
- రోజువారి రోగుల వివరాలు, మందులు వివరాలను ఆన్‌లైన్లో నమోదు చేయడానికి ప్రభుత్వం ఉచితంగా ల్యాప్‌టాప్‌ను అందజేసింది. ఆన్‌లైన్ ద్వారా ప్రభుత్వం పరిశీలించి మరిన్ని ఆయుర్వేద మందులను ఆస్పత్రికి పంపిస్తుంది.



ఆసుపత్రిలో మోకాలు నొప్పికి ఐఆర్ మిషన్‌తో వైద్యం అందిస్తున్న వైద్యురాలు లావణ్య

- ఆస్పత్రికి వచ్చే రోగికి పరిశుభ్రమైన తాగునీరు అందించేందుకు మినీ సైజ్ ఆర్వోప్లాంట్‌ను ఏర్పాటు చేసింది.
- త్వరలో పంచకర్మ సేవలు అందుబాటులోనికి (స్పెషల్ వెల్‌నెస్ సేవలు) రానున్నాయి.

రోగుల్లో అవగాహన పెరిగింది



ఆయుర్వేదంపై రోగులకు అవగాహన పెరిగింది. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులకు మందులు అందుబాటులో ఉన్నాయి. ఆస్పత్రిని కూడా అభివృద్ధి చేయడం జరిగింది. గతంలో 50 రకాల మందులు మాత్రమే ఉండేవి. ప్రస్తుతం 100 నుంచి 110 రకాలైన ముందులు ఉన్నాయి. ఓపీ సంఖ్య పెరుగుతుంది. ప్రతి రోజు యోగాపై ఉచిత శిక్షణ ఇస్తున్నాం.

–కె.లావణ్య, వైద్యురాలు

నేడు నాలుగు గ్రామాల్లో మంత్రి పర్యటన

కశింకోట: మండలంలోని నాలుగు గ్రామాల్లో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పర్యటించనున్నట్టు ఎంపీపీ కలగా లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు తెలిపారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులను ప్రారంభించనున్నట్లు చెప్పారు. తాళ్లపాలెం నుంచి శుక్రవారం ఉదయం ప్రారంభమయ్యే పర్యటనలో సచివాలయ భవనం, సిమెంట్ రోడ్లు, కాలువలు ప్రారంభిస్తారన్నారు. 11.30 గంటలకు కొత్తపల్లి సచివాలయ భవనం, 12 గంటలకు జమాదులపాలెంలో బహుళ ప్రయోజన గిడ్డంగి, మధ్యాహ్నం 12.30 గంటలకు కశింకోటలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తారన్నారు.

తేగాడలో ఘనంగా దుర్గాలమ్మ పండగ

కశింకోట : మండలంలోని తేగాడ గ్రామంలో దుర్గాలమ్మ ఉత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రజలు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను ఉత్సవ నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, పార్టీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్, పార్టీ అనకాపల్లి మండల అధ్యక్షుడు పెద్దిశెట్టి గోవింద్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నీటిపల్లి లక్ష్మి, జిల్లా యువజన నాయకులు కుమార్‌రాజా, దివాకర్ పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ ప్రారంభం

అనకాపల్లి : స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా గల భగవాన్ శ్రీసత్యసాయిబాబా మందిరంలో గురువారం యలమంచిలి శ్రీసత్య సాయి భజన మండలి మహిళలకు ఉచిత టైలరింగ్ అండ్ ఫ్యాషన్ డిజైనింగ్‌లో తొలి బ్యాచ్ శిక్షణ ప్రారంభమైంది. 40 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్టు జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌చార్జ్ అన్నం శివ రాజ శేఖర్ చెప్పారు. ఇప్పటికే 20 మందికి శిక్షణ ఇస్తున్నామని, మరో 20 మంది పేర్లు నమోదు చేసుకున్నామని తెలిపారు. ఆసక్తి గల మహిళలు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శిక్షకురాలు రాధిక, జిల్లా యూత్ కోఆర్డినేటర్ తాతాజీ, కన్వీనర్ కోడూరు వెంకటేశ్వరావు, యలమంచిలి మండల ఇన్‌చార్జి మహేశ్వర రావు పాల్గొన్నారు.



శిక్షణకు హాజరైన మహిళలు, భజనమండలి సభ్యులు

ఘనంగా నూకాంబిక రాట మహోత్సవం

తుమ్మపాల : వచ్చే కొత్త అమావాస్య పండగకు నూకాంబిక అమ్మవారి ఆలయంలో జరిగే పూజలకు అన్ని ఏర్పాట్లు శరవేగంగా జరుగుతాయని ఈఓ బండారు ప్రసాద్, ఆలయ చైర్మన్ కొణతాల మురళి అన్నారు. శ్రీనూకాంబిక దేవాలయంలో గురువారం బాలాలయంలో అమ్మవారి రాట మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్, ప్రముఖ వైద్యులు డా.విష్ణుమూర్తి అమ్మవారిని దర్శించుకున్నారు. పండితుల వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ పందిరి రాటని వేశారు. శరవేగంతో అమ్మవారి నూతన ఆలయం పునర్‌నిర్మాణ పనులు జరుగుతున్నాయని, కొత్తఅమావాస్య పండగకి అమ్మవారి మూలవిరాట్ దర్శనం భక్తులకు అందించాలనేదే అందరి తాపత్రయం అన్నారు.



నూకాంబిక అమ్మవారి రాట మహోత్సవాన్ని ప్రారంభిస్తున్న మలసాల భరత్‌కుమార్, డాక్టర్ విష్ణుమూర్తి

పెన్షనర్ల సమస్యలపై రిలే దీక్షలు

అనకాపల్లి : ఉపాధ్యాయ ఉద్యోగుల పెన్షనర్లు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏపీటీఎఫ్ ఉపాధ్యాయుల గురువారం రిలే నిరహారదీక్షలు చేపట్టారు. ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడు గణేష్ మాట్లాడుతూ 12వ పీఆర్‌సీలో మధ్యంతర భృతి 30శాతం తక్షణమే చెల్లించాలని, 11వ పీఆర్‌సీ బకాయిలు ఏక మొత్తంలో ఒకేసారి చెల్లించాలని అన్నారు. పెండింగ్ ఉన్న రెండు కొత్త డీఏలు తక్షణమే చెల్లించాలని, సీపీఎస్‌ను రద్దు చేయాలని, సీపీఎస్, డీఏల మొత్తం 90 శాతం క్యాష్ రూపంలో తక్షణమే చెల్లించాలని, 11 పీఆర్‌సీ బకాయిలు, పీఎఫ్, ఏపీజీఎల్ఐ రుణాలు, సరండర్‌లీవ్‌లు, మెడికల్ బకాయిలు చెల్లించాలని, ఉపాధ్యాయ నియామకాలు అప్రంటీస్ విధానంలో కాకుండా రెగ్యులర్ టైం స్కేల్‌లో నియమించాలని డిమాండ్ చేశారు.



దీక్షా శిబిరంలో ఉపాధ్యాయులు

టెన్త్ పరీక్షల విధుల నుంచి మినహాయింపునకు వినతి

కశింకోట : వయస్సు 55 ఏళ్లు పైబడిన, దీర్ఘకాలిక అనారోగ్యంతో బాధపడుతున్న ఉపాధ్యాయులకు, బాలింతలకు టెన్త్ పబ్లిక్ పరీక్షల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని ఎస్టీయు జిల్లా అధ్యక్షుడు ఆచంట రవి, ప్రధాన కార్యదర్శి కోడూరు పరదేశి కోరారు. ఈ మేరకు ఎస్టీయు తరఫున ఉపాధ్యాయులతో జిల్లా విద్యా శాఖ అధికారి వెంకటలక్ష్మమ్మను గురువారం కలిసి వినతిపత్రం అందించినట్టు తెలిపారు. ఈ విషయమై ఆమె సానుకూలత వ్యక్తం చేశారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ ఐ.వి.రామిరెడ్డి, జిల్లా ఆర్థిక కార్యదర్శి గంగాధర్, జిల్లా కౌన్సిలర్ ఉమామహేశ్వర్, జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.త్రినాథ్, తదితరులు పాల్గొన్నారు.



డీఈవో వెంకటలక్ష్మమ్మకు ఎస్టీయూ ఉపాధ్యాయుల వినతి

మహిళా మార్టులు మరిన్ని విస్తరించాలి

ఎస్.రాయవరం : గ్రామాల్లో మహిళా మార్టు ద్వారా నాణ్యమైన సరుకులు ప్రతి ఒక్కరూ కొనుగోలు చేసుకోవచ్చని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, సమన్వయకర్త కంబాల జోగులు అన్నారు. అడ్డురోడ్డు జంక్షన్‌లో రూ. 45 లక్షలతో ఏర్పాటు చేసిన వైఎస్సార్ చేయూత మహిళా మార్టు గురువారం ఎమ్మెల్యేలు ప్రారంభించారు. ఈ సందర్భంగా మార్టు ప్రయోజనాలు మహిళలు అందరికీ తెలిసేలా ప్రచారం చేయాలన్నారు. రాయితీతో కూడిన నాణ్యమయిన కిరాణా ఇతర సామాగ్రి కొనుగోలు చేసుకునేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ మార్టు నియోజకవర్గానికి ఒకటిగా కాకుండా మండలానికి ఒకటి చొప్పున విస్తరింపజేయాలన్నారు. పట్టణ ప్రాంతం మాదిరిగా గ్రామాల్లో మార్టులు ఏర్పాటు చేసి, రాయితీకి ప్రముఖ కంపెనీలు వస్తువులు అందివ్వడం అభినందనీయమన్నారు. మూడు మండలాల కూడలి అడ్డురోడ్డులో ఏర్పాటు చేసిన మార్టు చాలా ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోనికి వచ్చిన తరువాత అనేక సంస్కరణలు తీసుకువచ్చారని, వాటిలో ఈ మహిళా మార్టు ఒకటని చెప్పారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ఏపీడీ సీహెచ్ వరప్రసాద్, డీపీఎం ఫైనాన్స్ పి.శ్రీనివాస్, స్త్రీనిధి మేనేజర్ కరుణానిధి పాల్గొన్నారు.



ప్రారంభించిన మార్టులో సరుకులు కొనుగోలు చేస్తున్న గొల్ల బాబూరావు

మతసామరస్యానికి ప్రతీకగా ఉరుసు ఉత్సవం

- రేపు బయ్యవరంలో భారీ ఎత్తున నిర్వహణకు ఏర్పాట్లు

కశింకోట : మండలంలోని బయ్యవరంలో ఉన్న ప్రసిద్ధి చెందిన హజరత్ అన్సర్ మదీని ఔలియా దర్గా ఉరుసు షరీఫ్ (చందనోత్సవం) శనివారం (మార్చి 2న) జరగనుంది. మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే ఉత్సవాన్ని భారీ ఎత్తున నిర్వహించడానికి ఉత్సవ నిర్వాహకులు సన్నాహాలు చేశారు. ఉత్సవానికి ఉభయ విశాఖ జిల్లాతో పాటు తెలుగు రాష్ట్రాలు, టాటా నగర్, ఒడిశా వంటి రాష్ట్రేతర ప్రాంతాల నుంచి కూడా అధికంగా ముస్లింలు హాజరవుతారు. ఏటా మార్చిలో ఉత్సవాన్ని ఆనవాయితీగా నిర్వహిస్తున్నారు. 13వ శతాబ్దంలో హజ్రత్ అన్సర్ మదీని ఔలియా దక్షిణ భారతదేశంలో ధర్మ సంస్థాపన గావించారు. సర్వ మానవ సౌభ్రాతృత్వం కోసం వారి గురువైన ఢిల్లీకి చెందిన హజరత్ నిజాముద్దీన్ ఆజ్ఞ తీసుకొని నేటి కశింకోటకు వచ్చి బోధనలు సాగించారు. ఈ సందర్భంగా ప్రస్తుత గాడి వీధిలో నాడు పెద్ద పుస్తక భాండాగారం కూడా నెలకొల్పారు. ఉరుసు షరీఫ్ పురస్కరించుకొని అధిక సంఖ్యలో ముస్లిం భక్తులు ఔలియా సమాధిని దర్శించి ఛాదర్‌లు కప్పి పూలు, సుగంధ ద్రవ్యాలు సమర్పించి ప్రార్థనలు చేస్తారు. ఖర్జూరం, తీపి బూందీ, గులాబీ పూలు, చందనం, సుగంధ ద్రవ్యాలు వగైరా సంప్రదాయంగా సమర్పిస్తారు. కొంతమంది రాత్రి ఇక్కడ కుటుంబ సభ్యులతో జాగరణ చేస్తారు. ముస్లింలతోపాటు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన హిందూవులు కూడా ఔలియా దర్గాను ఎక్కువ సంఖ్యలో దర్శించి ఉరుసు ఉత్సవంలో ఉత్సాహంగా పాలు పంచుకుంటారు. దీంతో హిందూ, ముస్లింల ఐక్యతకు ప్రతీకగా ఉత్సవం నిలుస్తుంది. దర్గా ప్రాంతంలో రాత్రి పెద్ద ఉత్సవం జరుగుతుంది. ఉరుసు షరీఫ్ పురస్కరించుకొని శనివారం తెల్లవారుజాము నుంచి చందనోత్సవం ప్రారంభమవుతుంది. ఔలియా సమాధికి శనివారం గుసుల్ షరీఫ్ (చందనం పూయుట), సాయంత్రం 6 గంటలకు ఫాతియాఖాని అనంతరం ప్రసాద వితరణ జరుగుతుందని ఉత్సవ నిర్వాహకులు ముతవల్లి అబ్దుల్ హకీం, కార్యదర్శి ఎండి అయాజ్ తెలిపారు. రాత్రి 10 గంటలకు ఖవ్వాలి ఉర్దూ భక్తి పాటల పోటీ జరుగుతుందన్నారు. ముందు రోజు శుక్రవారం రాత్రి ఇషా నమాజు తర్వాత ఖురాన్ ఖానీ, మిలాద్ షరీఫ్ జరుగుతాయన్నారు. ఉత్సవం సందర్భంగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారన్నారు.



బయ్యవరం వద్ద వెలసి ఉన్న హజరత్ అన్సర్ మదీని ఔలియా దర్గా

స్థిరంగా కూరగాయల ధరలు

కశింకోట : కశింకోటలోని వారపు సంతలో గురువారం కూరగాయల ధరలు దాదాపు స్థిరంగా ఉన్నాయి. అయితే ఉల్లిపాయ, టమాటా కిలోకి రూ.5 పెరిగింది. కిలో ఉల్లిపాయ, టామటా రూ.20 నుంచి రూ.25కు పెరిగింది. బంగాళాదుంప రూ. 20,క్యాబేజి రూ.30, వంకాయ, దొండకాయ రూ.40, బీట్రూట్, క్యారెట్, బీరకాయ, బెండకాయ రూ.60, క్యాప్సికం, చిక్కుడు రూ.80కి విక్రయాలు సాగాయి.

గొర్రెలు, మేకల పెంపకానికి రుణాలు

కోటవురట్ల: పాడి రైతులకు పశు సంవర్ధక శాఖ ఆసరాగా ఉందని, గొర్రెలు, మేకల పెంపకానికి 50 శాతం రాయితీపై రుణాలు అందిస్తున్నామని పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ నరసింహులు అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో పశు వైద్య సిబ్బందితో గురువారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. పశు సంవర్ధక శాఖ ద్వారా కలుగుతున్న లబ్ధిని వివరించి రైతులను ప్రోత్సహించాలని అన్నారు. రాయితీపై గడ్డి విత్తనాలు, మెషిన్లు కూడా అందిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఏడీ సింహాద్రప్పడు, పశు వైద్యాధికారులు పాల్గొన్నారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మునగపాక : మండలంలోని ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఎంపీడీవో ఎం.మన్మథరావు తెలిపారు. చెర్లోపాలెం సచివాలయం రామగిరిలో మహిళ(బీసీ–డీ),మునగపాక-2 సచివాలయం మహిళ (బీసీ–బీ), నాగులాపల్లి బీసీ–మహిళ, ఎస్సీ–మహిళకు సంబంధించి ఖాళీగా ఉన్నాయన్నారు. పదో తరగతి పాసై 18 సంవత్సరాలు నిండిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 2వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. 4వ తేదీన దరఖాస్తుల పరిశీలన , ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. ఎంపిక కాబడిన అభ్యర్థులకు ఈ నెల 6వ తేదీన నియామక పత్రాలు అందజేస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మన్మథరావు కోరారు.

రూ.37 లక్షలతో నూతన బ్రిడ్జి నిర్మాణ పనులు

అనకాపల్లి : స్థానిక 83వ వార్డు పరిధిలో వేల్పులవీధి శ్రీ సీతారామకల్యాణ మండపం యల్లయ్య కాలువపై బ్రిటిష్ కాలంలో ఏర్పాటు చేసిన బ్రిడ్జి 10 అడుగులు ఉండడం, శిథిలావస్థకు చేరుకోవడంతో అటుగా ప్రయాణించే వాహనదారులు ఇబ్బందులు పడేవారు. ఈ సమస్యపై కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి ప్రత్యేక చొరవతో నూతన బ్రిడ్జి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. జీవీఎంసీ నుంచి మంజూరైన రూ.37లక్షల నిధులతో పాత బ్రిడ్జిని తొలగించి కొత్త బ్రిడ్జిని 20 అడుగుల వెడల్పు, 30 అడుగుల పొడవుతో నిర్మిస్తున్నారు. నెల రోజుల్లో బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోనికి తీసుకువచ్చేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు.



వేల్పులవీధి యల్లయ్య కాలువపై జరుగుతున్న బ్రిడ్జి నిర్మాణపనులు

తహసీల్దార్ సత్యనారాయణ సేవలు అభినందనీయం

తుమ్మపాల : తహసీల్దార్ సత్యనారాయణ సేవలు అందరికీ ఆదర్శనీయమని జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి అన్నారు. కలెక్టరేట్‌లో ల్యాండ్ విభాగం పర్యవేక్షకులుగా పనిచేస్తున్న సత్యనారాయణ గురువారం పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా రెవెన్యూ అధికారులు ఘనంగా సన్మానించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన జేసీ ఎం.జాహ్నవి ఆయన్ను దుశ్శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ సబ్బవరం వంటి క్లిష్టమైన మండలంలో తహసీల్దార్‌గా పనిచేసి అందరి మన్ననలు అందుకున్నారన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి మాట్లాడుతూ నిబద్ధతతో పనిచేసే సత్యనారాయణ రెవిన్యూ శాఖలో మంచి పేరు తెచ్చుకున్నారన్నారు. కలెక్టరేట్ సూపరింటెండెంట్ ఎ. శ్రీనివాసరావు మాట్లాడుతూ తన మిత్రుడైన బెల్లం సత్యనారాయణ 1986లో సర్వీస్ కమిషన్ ద్వారా ఎంపికై నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయంలో టైపిస్టుగా ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించారని, పదోన్నతులపై 2014లో తహసీల్దారుగా గొలుగొండలో పని చేశారన్నారు. అనకాపల్లి, చింతపల్లి, సబ్బవరంలో పనిచేసి ఇటీవల బదిలీపై కలెక్టర్ కార్యాలయానికి వచ్చారన్నారు.

ఈ సమావేశంలో కేఆర్‌సీసీ ఎస్‌డీసీ సుబ్బలక్ష్మి, అనకాపల్లి ఏవో పీఎల్ఎన్ గంగాధరరావు, నర్సీపట్నం ఏఓ వి.ప్రకాష్‌రావు, రెవిన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



తహసీల్దార్ బెల్లం సత్యనారాయణను సత్కరిస్తున్న జేసీ జాహ్నవి

లీపు సంవత్సరంపై చిన్నారులకు అవగాహన

అనకాపల్లి : స్థానిక ఉడ్‌పేట హ్యాపీకిడ్స్ ప్లే స్కూల్లో గురువారం లీప్ ఇయర్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఖగోళ శాస్త్ర పరంగా సమయాన్ని సూర్య గమనం ఆధారంగా లేక చంద్రగమనం ఆధారంగా లెక్కిస్తారని స్కూల్ కరస్పాండెంట్ శెట్టి గిరీష్‌కుమార్ పేర్కొన్నారు. అందువల్ల ఒకరోజు అంటే 24 గంటల సమయమే కాదు, కొన్నిసార్లు ఎక్కువ గంటలు, కొన్నిసార్లు తక్కువ గంటలు ఉండవచ్చని, ఈ హెచ్చుతగ్గులను సమతుల్యం చేసేందుకు నాలుగు సంవత్సరాలకు ఒకసారి లీప్ సంవత్సరంగా నిర్ణయిస్తామని ఆయన చిట్టి పొట్టి చిన్నారులకు వివరించారు. ఈ సందర్భంగా చిన్నారులంతా రంగురంగుల దుస్తులు వేసుకొని, గ్రీటింగ్ కార్డులు పంచుకొని 29 నెంబరు కేక్‌ను కోసి వేడుకల్లో సందడి చేశారు. ప్రిన్సిపాల్ సునీత పాల్గొన్నారు.

నేడు హాకీ మైదానం ఆధునికీకరణ

- రూ.1.60 కోట్లతో పనులు
- మంత్రి అమర్‌నాథ్ శంకుస్థాపన

నక్కపల్లి : మండల కేంద్రంలో రూ.1.60 కోట్లతో హాకీ క్రీడా మైదానం ఆధునికీకరణ పనులకు రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖామంత్రి గుడివాడ్ అమర్‌నాథ్ శుక్రవారం శంకుస్థాపన చేయనున్నారు. హాకీ క్రీడాకారుల కోసం నక్కపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో క్రీడామైదానాన్ని ఆధునీకరించేందుకు క్రీడామంత్రిత్వశాఖ రూ.1.60 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో హాకీ క్రీడాకారులతోపాటు ఇతర క్రీడలు ఆడేందుకు అవసరమయ్యే విధంగా ఆధునికీకరణ పనులు చేపట్టనున్నారు. శుక్రవారం ఉదయం జరిగే ఈ పనును రాష్ట్ర మంత్రి అమర్‌నాథ్ శంకుస్థాపన చేస్తారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే, రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన గొల్ల బాబూరావు,నియోజకవర్గ సమన్వయకర్త కంబాల జోగులు, స్థానిక నాయకులు హాజరు కానున్నారు.

రక్తహీనత నివారణకు ఐరన్ మాత్రల పంపిణీ

రాంబిల్లి : పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యకరంగా వుండవచ్చునని దిమిలి పీహెచ్‌సీ ఎంపీహెచ్‌ఈవో ఎస్.ఎస్.వి.ఎన్ రాజు అన్నారు. వెంకటాపురం పాఠశాలలో గురువారం ఆయన రక్తహీనత వున్న పలువురు విద్యార్థులకు ఐరన్ మాత్రలు మింగించారు. ఈ సందర్భంగా ఆయన రక్తహీనత సమస్య లేకుండా వుండేందుకు ఆకుకూరలను ఎక్కువగా తినాలన్నారు.

పరిశ్రమల్లో భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి

పరవాడ: పరిశ్రమల్లో భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని జాయింట్ డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జె.శివశంకర్‌రెడ్డి సూచించారు. జేఎన్ ఫార్మాసిటీలో 53వ జాతీయ భద్రత వార్షికోత్సవాలను పురస్కరించుకొని గురువారం నిర్వహించిన ప్రణాళిక సమావేశానికి శివశంకర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా భద్రత పరిచయ కరదీపిక పుస్తకాన్ని జేఎఫ్‌సీ శివశంకర్‌రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భద్రత పరిచయ కర దీపిక పుస్తకాలను ఫార్మా పరిశ్రమ ఉద్యోగులకు అందించడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో డీఎఫ్‌వో వి.సురేష్, ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్ పి.చిన్నారావు, ఆర్.వి.రమణ, జాతీయ భద్రత మండలి ఏపీ చాంబర్ వైస్ ప్రెసిడెంట్(లారస్ ల్యాబ్స్) ఎస్.ఎస్.రావు పాల్గొన్నారు.